
E-KABURU
# ఈ-కబురు
22-02-2025 శనివారం | హైదరాబాద్ | ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
www.ekaburu.com



ప్లీజ్.. అలా చేయొద్దు

5 లో

# ఓడితే ముక్కు నేలకు రాస్తా..!

పదేళ్ల ప్రగతిపై విపక్షాలకు సవాల్

పాలమూరును పాడుబెట్టిన కేసీఆర్

మాటలే తప్ప చేతల్లేని బీజేపీ

ఓర్వలేకనే సర్కారుపై దుష్ప్రచారం

జిల్లాను ప్రగతి బాట పట్టించి తీరతా

నారాయణపేట సభలో సీఎం రేవంత్



**ఈ-కబురు, నారాయణపేట:**

గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.


**పదేళ్లలో చేసిందేంటి?**

పది సంవత్సరాలు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే ఏనాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తరువాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదని విమర్శించారు. వైఎస్సార్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదని విమర్శించారు. రాజకీయం తప్ప పావలా మేలు చేసే పనులు కేసీఆర్ చేయలేదని సీఎం మండిపడ్డారు. నెట్టెంపాడు, భీమ, సంగంబండం, కోయిల్‌సాగర్,కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పది సంవత్సరాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ ఏపీ సీఎం చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదని తెలిపారు. 2004 నుంచి పదేళ్ల పాలనలో కాంగ్రెస్ 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిందని, కానీ, తర్వాతి పదేళ్లలో కేసీఆర్ ఒక్క పేద కుటుంబానికీ ఇల్లు ఇవ్వలేదని, కానీ, తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి

మిగతా 2లో

# ఆరోగ్య భీమా.. అందరికీ బీమా





కూటమి సర్కారు వినూత్న ప్రయోగం

ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల ఆరోగ్యబీమా

ఆరోగ్య కార్డున్న వారికీ ఈ బీమా కార్డు

రూ. 2.5 లక్షలలోపు చికిత్సంతా దీనిమీదే

ఆ మొత్తం దాటాకే ఆరోగ్య శ్రీ కార్డు సేవలు

రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజన

త్వరలో బీమా కంపెనీలతో చర్చలు

వీలున్నంత త్వరగా పట్టాలెక్కించేందుకు అడుగులు

**ఈ-కబురు, అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

మిగతా 2లో



## సమర్థ నేతలతోనే సిసలైన ప్రగతి

అన్ని రంగాల్లో కొత్త నాయకత్వం రావాలి

అదే జరిగితే.. గ్లోబల్ లీడర్‌గా భారత్

మానవ వనరులను వాడుకోవటమే కీలకం

గుజరాత్ అందుకు ఉత్తమ ఉదాహరణ

సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రధాని మోదీ

2 లో



## ఎవరిమీదా హిందీని రుద్దం

మూలాలకు దూరంగా విద్యార్థులు

అందుకే జాతీయ విద్యావిధానం

దీంతో నచ్చిన భాషను ఎంచుకోవచ్చు

రాజకీయ కోణంలో దీనిని చూడొద్దు

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

2 లో

## మూడు ఎమ్మెల్సీ సీట్లూ మావే

అన్ని స్థానాల్లో పోటీచేస్తోంది బీజేపీయే

బీఆర్ఎస్ ఇప్పటికే చేతులెత్తేసింది

కాంగ్రెస్‌కు యువత ఓటేసే ఛాన్సే లేదు

ఈ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మార్పులు

దోచిన సొమ్ము ఢిల్లీకి పంపుతున్నారు

ఈసారి వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు

**ఈ-కబురు, మెదక్:**

ఎన్నికల్లో గెలవటం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ, తీరా గెలిచాక మొహం చాటేసి, ప్రజలను మోసం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మెదక్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో

మిగతా 2లో



## తిరుపతిలో అతిపెద్ద రన్ వే

దేశంలోనే అతిపెద్దదిగా గుర్తింపు

అన్ని హంగులతో రెడీ అయిన రన్ వే


ఇక బోయింగ్ విమానాలూ దిగే ఛాన్స్

రూ.153 కోట్ల కేంద్ర నిధులతో హంగులు

రెట్టింపు కానున్న విమాన సేవలు

2 లో





## కాంగ్రెస్‌కు కోనేరు కోనప్ప గుడ్‌బై

వర్గ విభేదాలతో తప్పుకున్న నేత

రెండుసార్లు కాగజ్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నిక

ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి మద్దతు

ఇప్పటికి ఏ పార్టీలో చేరనని ప్రకటన

**ఈ-కబురు, ఆదిలాబాద్:**

తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. నిరుడు మార్చి 6వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇకపై

మిగతా 2లో

## కారు నిర్ణయంతో ఎన్నిక ఏకగ్రీవం

బల్దియా స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

15 సభ్యుల కమిటీకి 17 మంది పోటీ

8 ఎంఐఎం, 7 కాంగ్రెస్, 2 బీఆర్ఎస్ నామినేషన్లు

పోటీకి దూరంగా ఉన్న కమలనాథులు

బలం చాలక తప్పుకున్న బీఆర్ఎస్

ఏకగ్రీవంగా ముగిసిన కమిటీ ఎన్నిక

2 లో






2 లో

## నీళ్ల లెక్క ఇకనైనా తేలేనా?

నదీ జలాలపై తెలుగు రాష్ట్రాల తండ్లాట

నదీ జలాల పంపకంలో నేటికీ లేని క్లారిటీ

ఫలించని గత ప్రభుత్వాల యత్నాలు

రాజకీయ రంగు పులుముకున్న పంపకాలు

సోమవారం జరగనున్న కృష్ణా బోర్డు మీటింగ్

# ఓడితే ముక్కు నేలకు రాస్తా..!

మొదటి పేజి తరువాయి

3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని గుర్తు చేశారు.

**ఓడితే ముక్కు నేలకు రాస్తా**

కేవలం తన మీద వ్యక్తిగత కక్షతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేసిందని సీఎం ఆరోపించారు. ప్రజా పాలనపై విమర్శలు చేసే కిషన్ రెడ్డినీ సీఎం నిలదీశారు. మోదీ 11 ఏళ్లుగా, కేసీఆర్ 10 ఏళ్లు పదవిలో ఉండి చేసిందేమిటి? తాము 11 నెలల్లో చేసిందేమిటో చర్చిద్దామని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా తానూ సిద్ధమని, గత పదేళ్ల పాలనపై చర్చిద్దామని, ఈ చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.

**ఓర్వలేక అవాస్తవాలు..**

పది సంవత్సరాల్లో ఏమీ చేయని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఏడాది కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయటంపై సీఎం స్పందించారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని



ఆయా పార్టీల నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దని సూచించారు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. పాలమూరు బిడ్డ సీఎంగా ఉండటం, పాలమూరు మళ్లీ పచ్చగా కనబడటంతో కొందరు కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని, నష్టపరిహారం ఇచ్చి ఉద్దండాపూర్ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. 'పనులు చేసే బాధ్యత నాది నన్ను కాపాడుకునే బాధ్యత మీది..' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**ఇదీ మా పనితనం**

తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువకులకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మహిళలకు అమ్మ ఆదర్శ పాఠశాలలు అప్పగించి ప్రోత్సహించామని, ఆర్టీసీలో మహిళలకు 600 బస్సులను అప్పగించి వారిని ఓనర్లను చేశామని వివరించారు. రూ.5వేల కోట్లతో కొడంగల్, వెయ్యి కోట్లతో నారాయణపేట అభివృద్ధి పనులు ప్రారంభించుకున్నామని, ఏడాదికి 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని సీఎం లెక్క చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన గ్రామంలోనే బీఆర్ఎస్ పోటీ చేయాలని, తాము ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఊర్లోనే పోటీ చేస్తామని సవాలు విసిరారు. బీసీ కులగణన చేపట్టామని, 3 దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఉపకులాల సమస్యకు పరిష్కారం చూపామని గుర్తుచేశారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలుఇస్తామన్న మోదీ, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి తప్ప తెలంగాణలో ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదని సెటైర్ వేశారు.

## తిరుపతిలో అతిపెద్ద రన్ వే

**ఈ-కబురు, తిరుపతి:** తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్రంలోనే అతిపెద్ద రన్‌వే అందుబాటులోకి వచ్చింది. రూ.153 కోట్లతో దేశంలోనే అతిపెద్ద రన్‌వేగా దీనిని తీర్చి దిద్దే పని శుక్రవారం పూర్తి అయింది. దీంతో, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహణలో దేశంలోనే ఇదే పెద్ద రన్ వే గా నిలుస్తోంది. అలాగే, విమాన సర్వీసులు రోజుకు ఇప్పుడున్న 100 నుంచి 200 అయ్యే అవకాశం ఉంది.

**బోయింగ్ కూడా దిగొచ్చు..**

ఈ రన్ వేను 2,285 మీటర్ల నుంచి 3810 మీటర్ల మేర పెంచటంతో ఇకపై తిరుపతి విమానాశ్రయంలో బోయింగ్ 777 విమానాలు, ఎయిర్ బస్ 330 విమానాలు కూడా దిగే వీలు కలిగింది. గత రెండు దశాబ్దాల మధ్య కాలంలో అంచలంచెలుగా ఎదుగుతూ నేడు తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయికి చేరుకుంది. తాజా మార్పులతో ఇకపై, తిరుపతి విమానాశ్రయంలో ఇప్పుడున్న 100 రోజువారీ విమాన సేవలు.. 200 కాబోతున్నాయి.

## కారు నిర్ణయంతో ఎన్నిక ఏకగ్రీవం

**ఈ-కబురు, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. శుక్రవారం ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. గత పదేళ్లలో తొలిసారి కాంగ్రెస్ పార్టీ స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించుకోగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత తగిన సంఖ్యాబలం లేక.. ఈ కమిటీలో బీఆర్ఎస్ స్థానం కోల్పోవటమూ ఇదే తొలిసారి కావటం విశేషం.

**కారు నిర్ణయంతో ఏకగ్రీవం**

ఈసారి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను మొత్తం 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 8 ఎంఐఎం, 7 కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లవి కాగా, రెండు బీఆర్ఎస్ పార్టీ తరపున దాఖలయ్యాయి. ఈ ఎన్నికకు దూరంగా ఉండాలంటూ బీజేపీ ముందుగానే నిర్ణయించింది. అయితే, శుక్రవారం రోజున.. తగినంత సంఖ్యాబలం లేకపోవటంతో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోవటంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. దీంతో 15 మంది సభ్యుల స్టాండింగ్ కమిటీలో ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7 సభ్యులు ఉండనున్నారు.

## నీళ్ల లెక్క ఇకనైనా తేలేనా?

**ఈ-కబురు, హైదరాబాద్:** రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు పూర్తవుతున్నా నదీ జలాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మాటల యుద్ధాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ 11 ఏండ్లలో మూడుసార్లు ఎన్నికలు జరిగి.. పలువురు నేతలు పగ్గాలు చేపట్టినా నీళ్ల పంచాయితీ మాత్రం తేలనేలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల కృష్ణానదీ యాజమాన్య బోర్డు దీనిపై ఒక ప్రకటన చేసింది. దీంతో రెండు రాష్ట్రాల ప్రతినిధులు కూర్చొని సామరస్యంతో ఈ సమస్యను పరిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

**బచావత్ అవార్డ్ లెక్కలు..**

దక్షిణాదిలోని కీలక నదులైన కృష్ణ, గోదావరి జలాల విషయంలో ఉమ్మడి ఏపీలోనే పేచీలుండేవి. అప్పట్లో కృష్ణా జలాల విషయంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఏపీల మధ్య పోటీ ఉండగా, గోదావరి విషయంలో మహారాష్ట్రతో కొన్ని సమస్యలుండేవి. కాగా, 2014లో ఏపీ విభజనతో ఈ విషయాల్లో తెలంగాణ వాటా కూడా చర్చలోకి వచ్చింది. కాగా, ఈ నదీజలాలపై 1969లో ఏర్పాటైన బచావత్ కమిటీ ఆదేశాల ప్రకారం.. కృష్ణానదిలోని 75 శాతం నికరజలాలలో 811 టీఎంసీలు ఉమ్మడి ఏపీకి, కర్ణాటకకు 700, మహారాష్ట్రకు 560 టీఎంసీలు కేటాయించారు. అయితే, 2014లో తెలంగాణ ఏర్పడ్డాక.. ఆ 811 టీఎంసీలలో తెలంగాణకు 299, శేషాంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా పంపకాలు జరిగాయి.

**ఏపీ, తెలంగాణ వాదన..**

అయితే, కృష్ణా నది ఎక్కువగా తెలంగాణలోనే ప్రవహిస్తుంది కాబట్టి ఏపీ కంటే తమకే ఎక్కువ నీళ్లు రావాలని తెలంగాణ కోరుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఏపీలోని 811 టీఎంసీల్లో 70 శాతం అంటే 558 టీఎంసీలు తమకే రావాలని తెలంగాణ వాదిస్తోంది. అప్పట్లో కనీసం 50:50 వాటాగానైనా ఇది ఉండాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. అయితే, పలు కారణాలు చూపుతూ, ఈ వాదనను ఏపీ ఖండిస్తోంది. దీంతో ఉభయ రాష్ట్రాల మధ్య వివాదం సాగుతోంది. అదే సమయంలో కృష్ణా నదిపై నిర్మిచే ప్రాజెక్టులపైనా రెండు రాష్ట్రాల మధ్య మాటలయుద్ధం సాగుతోంది.

**సీఎంల యత్నాలు..**

తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు నాటి సీఎంలు కేసీఆర్, జగన్ ఓసారి ఈ అంశంపై సమావేశమయ్యారు. అప్పట్లో ఈ నదీ జలాల వివాదం పరిష్కారం అవుతుందని అందరూ భావించినా అది జరగలేదు. ఇటీవల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు కూడా దీనిపై సమావేశమైనా ఈసారీ ఏదీ తేలకుండానే ఆ సమావేశం ముగిసింది. ఈ నేపథ్యంలో 2025 జనవరి 21న హైదరాబాద్?లోని జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్?ఎంబీ) ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో కీలక సమావేశం జరిగింది. దీనికి తెలుగురాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరై, మొత్తం 29 అంశాలతో కూడిన ఎజెండాపై కీలక చర్చలు జరిపారు. తాజాగా, వేసవి వస్తున్న వేళ.. మరోసారి కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లోని పలు పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. రెండు రాష్ట్రాల నేతల మధ్య జరుగుతున్న వాదోపవాదాల నేపథ్యంలో శుక్రవారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకు నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించాలని బోర్డు నిర్ణయించింది.

## సమర్థ నేతలతోనే సిసలైన ప్రగతి

**ఈ-కబురు, నేషనల్ బ్యూరో:** వివిధ రంగాల్లో మార్పు తెచ్చే విజనరీ నేతలు తయారు కావాలని, స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్ షిప్ (SOUL)ఇందుకు ఎంతో దోహదపడుతుందని తాను ఆశిస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారంనాడు జరిగిన 'సోల్' లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని మాట్లాడుతూ, వికసిత్ భారత్ (అభివృద్ధి భారతం) జర్నీలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూషన్ ప్రారంభించడం ఒక ల్యాండ్‌మార్క్ కాబోతోందని అన్నారు.

**యువ నేతలు రావాలి..**

నేడు దేశంలో రాజకీయాలతో బాటు ప్రతి రంగంలోనూ కొత్త నాయకత్వం అవసరముందని, అలాంటి నేతలను తయారు చేయటంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ కీలకమైన ముందడుగు అవుతుందని మోదీ అన్నారు. గిఫ్ట్ సిటీ సమీపంలో సోల్ కొత్త క్యాంపస్ త్వరలోనే ప్రారంభమవుతుందని, నిర్మాణ పరంగానూ ఇది తలమానికంగా నిలవనుందని మోదీ అన్నారు. ఇందుకు సంబంధించిన మోడల్, ప్లాన్‌ను తనకు చైర్మన్ చూపించారని చెప్పారు.

**వివేకానంద బాటలో..**

తనకు వందమంది శక్తివంతులైన యువతీయువకులను ఇస్తే.. దేశ గతిని మార్చి చూపుతానని చెప్పిన స్వామీ వివేకానంద మాటలు ముమ్మాటికీ నిజమని, అన్ని రంగాలలో సమర్థ నాయకత్వం ఆవిర్భవిస్తే.. భారత్ అనుకున్న దానికంటే ముందుగానే ప్రపంచస్థాయి దేశంగా నిలుస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. మనదేశం నుంచి ప్రపంచ ప్రమాణాలు, భారతీయ విలువలతో కూడిన మరింత మంది నేతలు రావాలని, తద్వారా మనదేశం ప్రపంచానికి అవసరమైన మానవ వనరులకు కేంద్రంగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

**గుజరాతే ఉదాహరణ**

ప్రపంచంలోని ఏ ప్రాంతం అభివృద్ధి అయినా, అక్కడి సహజ వనరుల కంటే అక్కడి నైపుణ్యం గల మానవ వనరుల మీదనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఉమ్మడి మహారాష్ట్ర నుంచి గుజరాత్ విడిపోయినప్పుడు అక్కడ బొగ్గు, నదీ జలాలు, మౌలిక సదుపాయాలు లేవనీ, ఎడారి ప్రాంతం, పాకిస్థాన్ సరిహద్దు ఉండటంతో ఆ రాష్ట్రానికి ఎలాంటి భవిష్యత్తు ఉండదని అప్పట్లో చాలామంది ఆందోళన చెందారని మోదీ గుర్తుచేసుకున్నారు. కానీ, సమర్థులైన నాయకుల మూలంగా నేడు గుజరాత్ దేశంలో అత్యుత్తమ రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్రంలో ఒక్క వజ్రాల గని లేకున్నా.. నేడు ప్రపంచంలోని పది వజ్రాల్లో తొమ్మిది గుజరాతీ చేతుల్లో నుంచే వెళుతున్నాయని మోదీ గుర్తుచేశారు.

**ఎంతో నేర్చుకున్నా: తోబ్గే**

భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు పెద్దన్న వంటి వారని భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే అన్నారు. దిల్లీలో నిర్వహించిన 'సోల్' లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొని ప్రసంగించారు. తాను బాధ్యతలు చేపట్టిన తొలిరోజుల్లో.. తాను పాలనకు తగిన వ్యక్తిని కాదనే భావన తన మనసులో ఉండేదని గుర్తుచేసుకున్నారు. భారత్ పర్యటనకు ఓ విద్యార్థిగా వచ్చానని, దీనివల్ల ఎంతో నేర్చుకున్నానని, ఇది తనకు దొరికిన గొప్ప సదావకాశమని తోబ్గే సంతోషం వ్యక్తం చేశారు. బిరుదుల మూలంగా ఎవరూ గొప్ప నేతలు కాలేరని, తమ విజన్, కఠోర శ్రమతో తమ సమాజాన్ని ముందుకు నడిపే వారే నిజమైన నేతలని తోబ్గే అభిప్రాయపడ్డారు. పదేళ్ల పాలనలో మోదీ భారత్‌లో గొప్ప మార్పులు తెచ్చారని ఆయన కితాబిచ్చారు.

## ఎవరిమీదా హిందీని రుద్దం

**ఈ-కబురు, నేషనల్ బ్యూరో:** దేశంలోని ఏ రాష్ట్రంపైనా హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం విషయంలో అందరూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని పేర్కొంటూ ఆయన తమిళనాడు సీఎం స్టాలిన్‌కు శుక్రవారం ఒక లేఖ రాశారు. గత కొద్దిరోజులుగా కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య హిందీ అంశంపై మాటల యుద్ధం నడుస్తున్న వేళ.. కేంద్రమంత్రి లేఖ రాయటం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

**బలవంతం లేదు..**

దేశంలో ఎవరిపైనా బలవంతంగా హిందీ భాషను రుద్దే ఉద్దేశం కేంద్రానికి లేదని కేంద్ర మంత్రి స్టాలిన్‌కు రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే, విదేశీ భాషపై అధికంగా ఆధారపడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, దీనివలన విద్యార్థులకు తమ మూలాలపై అవగాహన తగ్గుతోందని వివరించారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు జాతీయ విద్యావిధానం తీసుకురావటం జరిగిందని, ఇందులో భాగంగా విద్యార్థులు తమకు నచ్చిన భాషను ఎంచుకునే వీలుంటుందని గుర్తు చేశారు.

**నో పాలిటిక్స్ ప్లీజ్..**

కేవలం రాజకీయ కారణాలతోనే జాతీయ విద్యావిధానాన్ని తమిళనాడులోని డీఎమ్‌కే సర్కారు వ్యతిరేకిస్తోందని ధర్మేంద్ర ప్రధాన్ తన లేఖలో తప్పుబట్టారు. ఈ విధానంపై ప్రభుత్వం హ్రస్వ దృష్టితో వ్యాఖ్యలు చేయటం సరికాదని హితవు పలికారు. తమ రాజకీయ లక్ష్యాల కోసం ప్రగతి శీల విధానాలను ప్రమాదాలుగా చూపటాన్ని కేంద్రమంత్రి తప్పుపట్టారు. తమిళ భాష అజరామరమైనదని చెన్నైలో ప్రధాని మోదీ చెప్పిన మాటనూ సీఎంకు రాసిన లేఖలో గుర్తుచేశారు. తమిళ భాష, సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇకనైనా, విద్యా విధానం మీద రాజకీయాలు వద్దని విజ్ఞప్తి చేశారు.

**సీఎం లేఖతో మాటలయుద్ధం**

అంతకుమునుపు, తమిళనాడు సీఎం స్టాలిన్ జాతీయ విద్యావిధానాన్ని విమర్శిస్తూ ప్రధానికి ఓ లేఖ రాశారు. మూడు భాషల బోధనతో ఉన్న జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకపోతే కేంద్ర నిధులు వదులుకోవాల్సి వస్తుందంటూ ధర్మేంద్ర ప్రధాన్ హెచ్చరిక చేస్తున్నారని తన లేఖలో సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శిస్తూ కేంద్రం రూ.2,154 కోట్ల నిధులను విడుదల చేయాలని మోదీని కోరారు. అయితే, ఈ లేఖపై కేంద్ర మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తమిళాడు సీఎంకు ప్రత్యుత్తరమిచ్చారు.

## మొదటి పేజి తరువాయి

### మూడు ఎమ్మెల్సీ సీట్లూ మావే

ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు వచ్చి తీరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**అప్పుల కుప్పగా.. రాష్ట్రం**

గత ఎన్నికల వేళ.. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు.. ఇలా అనేక రంగాల వారికి ఇచ్చిన హామీలలో ఒక్కటీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదైనా అమలు చేయలేకపోయిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అశోక్ నగర్‌లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోయాయని అన్నారు. జాబ్ క్యాలెండర్‌ను పక్కన పెట్టేశారని మండిపడ్డారు. తెలంగాణ ఆర్థికంగా దివాలా తీసిందని, ఉద్యోగుల జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏలు కూడా ఇవ్వలేకపోతున్నారని అన్నారు. మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చితే.. కాంగ్రెస్ కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు.

**బీజేపీ వస్తేనే..**

తెలంగాణలో అన్ని రంగాల్లో ప్రగతి కుంటుబడిందని, అవినీతి పెరిగిపోయిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. మంత్రుల మధ్య సమన్వయమే లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ తెలంగాణలో మాదిరిగా ఆర్థిక పరిస్థితి తలకిందులైందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఈ పరిస్థితి పోయి, తిరిగి రాష్ట్రం గాడిన పడాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని, ఇందుకు బీజేపీ పాలిత రాష్ట్రాలే నిదర్శనమని అన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికపై..**

తెలంగాణలో జరుగుతున్న మూడు శాసనమండలి స్థానాల ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికలు తెలంగాణకి దశా దిశను నిర్దేశించబోతున్నాయని ఓటర్లకు సూచించారు.

### కాంగ్రెస్‌కు కోనేరు కోనప్ప గుడ్‌బై

ఏ పార్టీలో కాకుండా స్వతంత్రంగా ఉంటానని కోనప్ప ప్రకటించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల వల్లే కోనేరు కోనప్ప రాజీనామాకు దారి తీశాయని తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల వేళ అధికార పార్టీని వీడుతూ ఆయన తీసుకున్న నిర్ణయం హస్తం పార్టీకి దెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఇదీ నేపథ్యం..**

తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ తరపున సిర్పూర్ కాగజ్ నగర్ స్థానం నుంచి పోటీ చేసి కోనేరు కోనప్ప.. నాటి బీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై కోనప్ప విజయం సాధించారు. ఎన్నికల తర్వాత నిర్మల్ నుంచి బీఎస్పీ టికెట్‌పై గెలిచిన మరోనేత ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం 2018లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ, 2023లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో కోనప్ప ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో తనపై బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంతో అసంతృప్తికి గురైన కోనప్ప... గత లోక్‌సభ ఎన్నికలకు ముందు గులాబీ పార్టీకి రాజీనామా చేసి, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే, ఏడాది గడవకుండానే కోనప్ప ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు.

**సిర్పూర్ కాంగ్రెస్‌లో వర్గపోరు**

గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, అప్పటికే నియోజక వర్గ ఇన్‌ఛార్జ్‌గా అక్కడ రావి శ్రీనివాస్ పనిచేస్తూ ఉన్నారు. కోనప్ప కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత అక్కడ వర్గపోరు మొదలు కావటంతో పార్టీలో 3 గ్రూపులు ఏర్పడ్డాయి. రూ.75 కోట్లతో మంజూరు చేయించిన ఫ్లై ఓవర్‌ను క్యాన్సిల్ చేయడంపై కోనప్ప అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

## ఆరోగ్య ధీమా.. అందరికీ బీమా

మొదటి పేజి తరువాయి

ప్రస్తుతం బియ్యం కార్డు ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వం అందించే ఆరోగ్య శ్రీ తరహా ఉచిత వైద్యం అందుతుండగా, నామమాత్రపు ప్రీమియంతో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. దీనికోసం ఉమ్మడి శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక యూనిట్‌గా, గుంటూరు నుంచి మిగిలిన ప్రాంతాన్ని రెండో యూనిట్‌గా విభజించారు. ఈ రెండు యూనిట్లకు త్వరలోనే బీమా కంపెనీల నుంచి టెండర్లను పిలవనున్నారు.

**షరతుల్లేకుండా బీమా**

ఏపీలో ప్రస్తుతం రూ. 5 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఏడాదికి రూ.25 లక్షల విలువైన చికిత్సలను ఉచితంగా అందిస్తున్నారు. అయితే, ఇందులో చాలా షరతులున్నాయి. కాగా, కొత్త విధానంలో వార్షిక పరిమితి, ఇతర షరతులతో నిమిత్తం లేకుండా అందరికీ ఉచితంగా బీమా సౌకర్యాన్ని అందించనున్నారు. అర్హత గల కుటుంబాలకు ఇప్పుడున్న ఆరోగ్య శ్రీ తరహా సేవలు కొనసాగిస్తూనే, ఆ వార్షికాదాయ పరిధి దాటిని వారికి ఏడాదికి రూ.రెండున్నర లక్షల విలువైన వైద్య బీమా అందించాలని భావిస్తున్నారు.

**అపోహలొద్దు..**

అయితే, ఉచిత ఆరోగ్య బీమా పథకం వస్తే ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్న ప్రచారమూ తెరమీదికి రావటంతో ప్రభుత్వం దానికీ క్లారిటీ ఇస్తోంది. ఆరోగ్య శ్రీ కొనసాగిస్తూనే ఉచిత బీమా పథకం కూడా అమలులోకి వస్తుందని చెబుతున్నారు. ఏపీలో ఇలా రెండున్నర లక్షల లోపు వైద్య ఖర్చులు పెట్టే వారి సంఖ్య 90శాతానికిపైగా ఉంటోందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని, కనుక రెండున్నర లక్షల వరకు అందరికీ ఉచిత ఆరోగ్య బీమా ద్వారా సేవలు అందించి, ఆ పైన ఖర్చు పెట్టాల్సి వస్తే అప్పుడు ఆరోగ్య శ్రీకి వెళ్లాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టతనిస్తోంది.

**వారికీ న్యాయం చేసేందుకు..**

ఏపీలో ప్రధానంగా పట్టణ ప్రాంత ప్రజలకు, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ కాస్తో కూస్తో పన్ను కట్టేవారికీ ప్రభుత్వాల నుంచి ప్రస్తుతం ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు. ఏపీలో వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండి, ఆరోగ్య శ్రీ సేవలకు అర్హత ఉన్న కుటుంబాలు 1.48 కోట్లు ఉండగా, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 8.5 లక్షల మంది ఉన్నారు. బీమా పథకం కింద ఏడాదికి ఒక్కో ఉద్యోగి, పెన్షనర్ సుమారు రూ.7వేల వరకు చెల్లిస్తున్నారు. జర్నలిస్టులు కూడా జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌లో ప్రీమియం చెల్లిస్తున్నారు. ప్రీమియం చెల్లించే జాబితాలో ఉన్న వారికి మినహాయించి మిగిలిన వారందరికీ ఈ రెండున్నర లక్షల బీమా విధానాన్ని వర్తింపచేసేందుకు వీలుగా ప్రతిపాదించారు.

**టెండర్ల మీద క్లారిటీ**

దీనిపై ఇప్పటికే ఒక క్లారిటీకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారంలోనే బీమా కంపెనీలను పిలిచి మాట్లాడాలని భావిస్తోంది. ఏపీలోని 2 యూనిట్లకూ కలిపి ఒకే టెండరు పిలవాలని, తక్కువ కోట్ చేసి ఎల్ 1 గా ప్రైవేట్ కంపెనీ వస్తే అదే ధరకు సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ రంగ సంస్థను ఆహ్వానించాలని సర్కారు భావిస్తోంది. దీనికి ప్రభుత్వ రంగ సంస్థ ఆమోదం తెలిపితే మరో యూనిట్ బాధ్యత అప్పగిస్తారు. ఒకవేళ ప్రభుత్వ రంగ సంస్థనే ఎల్ 1 గా నిలిస్తే రెండు ఏరియాల్లో బీమా నిర్వహణ బాధ్యతను వారికే అప్ప గిస్తారు. ఎంపికచేసిన బీమా కంపెనీ మూడేళ్ల పాటు బీమా సేవలు అందించాలి. ప్రతి ఏడాది పనితీరును సమీక్షిస్తారు.

**ఇదీ తేడా..**

ఆరోగ్య శ్రీకి, ప్రైవేటు బీమాకు గల తేడానూ సర్కారు పరిశీలించింది. ఆరోగ్య శ్రీ అనుమతి కోసం రోగి 24 గంటలు వేచి చూడాల్సి ఉండగా, ఈ బీమా వస్తే.. 6 గంటల్లోనే అనుమతి వస్తుంది. చికిత్సకు బీమా సంస్థ నిరాకరిస్తే అప్పీలు వెసులుబాటు కల్పిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉండేలా నిబంధనలు ఉంటాయి. ప్రభుత్వ ఆరోగ్య బీమా సంస్థలకు ప్రతి మూడు నెలలకొకసారి ప్రభుత్వం ముందుగానే చెల్లింపులు చేస్తారు. దీనివల్ల బిల్లుల చెల్లింపుల సమస్యలు ఉండదు. రోగులకు అందించిన చికిత్స వివరాలు అందిన తర్వాత బీమా సంస్థలు సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు చేసేలా నిర్దేశిత గడువును ముందే నిర్ణయిస్తారు.





ఫ్లై చికెన్ ఔట్ లెట్‌ను ప్రారంభిస్తున్న కుల్ ప్రీత్ తదితరులు

# గచ్చిబౌలిలో 'ఫ్లై చికెన్' ఔట్ లెట్ ప్రారంభం

### ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** ఆహార ప్రియులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నిరీక్షణకు తెరపడింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'ఫ్లై చికెన్' గచ్చిబౌలిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫ్లై చికెన్ ఇండియా సీఈఓ కుల్‌ప్రీత్ సాహ్ని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఫ్రైడ్ చికెన్ ప్రియుల మన్ననలు పొందిన ఈ బ్రాండ్ నగరానికి విచ్చేసిందన్నారు. కుర్రకారు హృదయాలు గెలుచుకున్న ఈ బ్రాండ్ తన ప్రత్యేకమైన క్రిస్పీ చికెన్, అంతర్జాతీయ స్థాయి మెను ద్వారా నగరంలో ఫ్రైడ్ చికెన్ అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లనుందని చెప్పారు. ఈ ఫ్లై చికెన్ స్కాండినేవియాలో ప్రారంభమైందన్నారు. నాణ్యత, అత్యుత్తమ రుచి, క్రంచీ టెక్సర్ తో ప్రపంచవ్యాప్తంగా ఆహార ప్రియులను ఆకర్షించిందన్నారు. ఓపెనింగ్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, గిఫ్ట్‌లు, సర్ప్రైజ్ ట్రీట్స్ ఉన్నాయన్నారు. ఈ ఔట్ లెట్ మొత్తం 103 సీటింగ్ కెపాసిటీ కలిగి ఉందని చెప్పారు. భారతదేశపు ప్రధాన మెట్రో నగరాల్లో స్థానం ఏర్పరచుకోవాలని ఫ్లై చికెన్ లక్ష్యంగా పెట్టుకుందని, ఈ సంవత్సరం మొత్తం 10 రెస్టారెంట్లు, రానున్న 5ఏళ్లలో దేశవ్యాప్తంగా 250 అవుట్‌లెట్లు స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# ముగిసిన ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్

### విజేతగా నిలిచిన హర్యానా సోని పట్ జిల్లా టీమ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో గత మూడు రోజులుగా కొనసాగిన 2వ ఆల్ ఇండియా ఇంటర్ డిస్టిక్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ శుక్రవారం ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు కొనసాగిన ఈ ఛాంపియన్ షిప్ లో దేశంలోని వివిధ రాష్ట్రాల పరిధిలోని జిల్లాల టీంలు పాల్గొన్నాయి. ఛాంపియన్ షిప్ లో హర్యానా రాష్ట్రం సోనిపట్ జిల్లా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. మన రాష్ట్రానికి చెందిన మహబూబాబాద్ జిల్లా జట్టు రెండవ స్థానంలో నిలిచి బహుమతిని సొంతం చేసుకుంది. 3వ స్థానంలో హర్యానా రాష్ట్రం జైపూర్ జిల్లా జట్టు, 4వ స్థానంలో గుజరాత్ రాష్ట్రం అమ్రాలి జిల్లా టీంలు నిలిచాయి. ముగింపు వేడుకలకు గ్రేస్ ఫౌండేషన్ ఎండి శాలిమ్ జోత్స్న రాజు, ఏసిపి రవికుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని.. ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా విజయం కోసం ప్రయత్నించడమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు, తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్యామల పవన్ కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలరెడ్డి, హైదరాబాద్ ప్రెసిడెంట్ చామల ఉదయ్ చందర్ రెడ్డి, హైదరాబాద్ సెక్రటరీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# భయపెట్టి రూ.1.38 కోట్లు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు..

### ఇద్దరిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు




డిజిటల్ అరెస్ట్ పేరుతో 82 ఏళ్ల వృద్ధుడి ఫోన్...

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** "మీ బ్యాంక్ అకౌంట్ల ద్వారా మనీ లాండరింగ్ జరిగింది... మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని భయపెట్టి ఓ 82 ఏళ్ల రిటైర్డ్ ఇంజనీర్ నుంచి 1.38 కోట్ల రూపాయలు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. వృద్ధుడి పిర్యాదుతో రంగంలోకి దిగిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్(82)కు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఎస్‌బిఐ ప్రతినిధి అంటూ పరిచయం చేసుకున్నాడు. మీ బ్యాంక్ అకౌంట్ల ద్వారా మనీ లాండరింగ్ జరిగిందని, మీపై కేసు నమోదయ్యిందని భయపెట్టాడు. మీతో ముంబై సైబర్ క్రైమ్ అఫీసర్ మాట్లాడుతాడంటూ వాట్సప్ కాల్‌లో మరో వ్యక్తితో మాట్లాడించాడు. సదరు వ్యక్తి వృద్ధుడితో.. మీ బ్యాంక్ అకౌంట్ల ద్వారా మనీ లాండరింగ్ జరిగిందని, మీ అధార్ వివరాలు ఇవ్వాలని, మీ బ్యాంక్ అకౌంట్లను చెక్ చేస్తామని చెప్పడంతో, భయపడిపోయిన వృద్ధుడు తన అధార్ కార్డు వివరాలను వారికి చెప్పాడు. ఆ తర్వాత వారి బెదిరింపులకు భయపడిన వృద్ధుడు వారు చెప్పిన బ్యాంకు అకౌంట్లకు 1.38 కోట్ల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత సన్నిహితులకు చెప్పడంతో విషయం వెలుగులోకి రాగా, మోసపోయినట్లు గుర్తించిన రిటైర్డ్ ఇంజనీర్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమిళనాడులోని తిరుచిరాపల్లికి చెందిన శంకర్ గణేష్(46), సహచరుడు ఎలంచెజియన్ సత్యవేల్‌లను అరెస్ట్ చేశారు. శంకర్ గణేష్ తన అనుచరుడితో కలిసి 10శాతం కమిషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సచిన్, జెస్మిన్ మోండల్, ముత్తుకుమార్, సలీమ్ అనే వ్యక్తులు అఫీసర్లుగా నటిస్తూ డిజిటల్ అరెస్ట్ పేరుతో కోట్ల రూపాయలు కొట్టేసి తమ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మరో కేసులో....**

డిజిటల్ అరెస్ట్ పేరిట రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి నుండి 28.68 లక్షలు కొట్టేసిన అరుగురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి(66)కి ముంబై పోలీస్ అఫీసర్ అంటూ ఓ వ్యక్తి కాల్ చేసి మీ అధార్ కార్డుతో ముంబైలో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేశారని, మీ బ్యాంక్ అకౌంట్ ద్వారా మనీ లాండరింగ్ జరిగిందని చెప్పాడు. వివేక్‌దాస్ కేసులో మీ బ్యాంక్ పాస్‌బుక్ దొరికిందని, 3 కోట్ల లావాదేవీలు జరిగాయని, విచారణకు సహకరించకపోతే 3 నుండి 7 సంవత్సరాల జైలు శిక్ష లేదా 50 లక్షలు ఫైన్ విధిస్తామని భయపెట్టాడు. మీ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న డబ్బులను చెక్ చేయాలని చెప్పడంతో భయపోడిపోయిన సదరు రిటైర్డ్ ఉద్యోగి వారు సూచించిన పలు బ్యాంక్ అకౌంట్లకు రూ.28.68 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం తాను మోసపోయినట్లు గుర్తించి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నెల 17వ తేదిన కేరళలోని మెప్పాడిలో ముస్తాఫా, హెన్సిలీ జోసెఫ్, మణికందన్‌లను, 19వ తేదిన కేరళలోని మలప్పురంలో హంజా, ఆషిఫ్ అలీలను అరెస్ట్ చేశారు. ముస్తాఫా, హెన్సిలీ జోసెఫ్, మణికందన్, హంజా, ఆషిఫ్ అలీలు బ్యాంక్ అకౌంట్లను సమకూర్చి ప్రధాన నిందితుడు బాబుకు కమిషన్ పద్ధతిలో అందజేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బాబు పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుండి నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు పాస్ బుక్‌లు, మూడు బ్యాంక్ చెక్ బుక్‌లు,7 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

### నేడు గచ్చిబౌలి డివిజన్ లో రూ. 83.80 లక్షల

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### పాల్గొననున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో శనివారం భారీ వ్యయంతో చేపట్టనున్న నూతన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ శనివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి చేతుల మీదుగా 83.80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటలకు గుల్మోహర్ పార్క్ కాలనీలో 14.80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, నేతాజీ నగర్ కాలనీ లో 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.00 గంటలకు గోపనపల్లిలో గల సిపిఆర్ బెల్లా విస్టా నుండి నల్లగండ్ల మెయిన్ రోడ్డు వరకు 49 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ రాష్ట్ర,జిల్లా,సీనియర్ నాయకులు,డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### అధికార మహాయుతి కూటమిలో విభేదాలు

#### తన పపవరేంటో అందరికీ తెలుసు

#### డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే కీలక వ్యాఖ్యలు

**ముంబై:** మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో విభేదాలు తీవ్రమయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న శిందే.. 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా మరోసారి ప్రస్తావించారు. శిందే హయాంలో ఆమోదించిన ఓ ప్రాజెక్టును ఫడణవీస్ ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో శివసేన నేత ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నేను ఓ సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతి ఒక్కరు దీన్ని అర్థం చేసుకోవాలి. 2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నప్పుడు.. నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టానని మీడియా ముందు ఏక్‌నాథ్ శిందే పేర్కొన్నారు. అనంతరం విధానసభలో చేసిన మొదటి ప్రసంగంలో దేవేంద్ర ఫడణవీస్‌కు 200కంటే ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పానని, 232 సీట్లు వచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని, ఇది ఎవరిని ఉద్దేశించి చెబుతున్నానో వాళ్లు అర్థం చేసుకు ంటారని అన్నారు.మహా రాష్ట్రలో భాజపా-శివసేన-ఎన్సీపీల మహాయుతి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 132 స్థానాల్లో విజయం సాధించగా.. శివసేన 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

# కొండాపూర్ లో రూ.11.55 కోట్లతో చేపట్టనున్న వరద నీటి కాలువ పనులకు శంకుస్థాపన

### తెలంగాణకు ఫైనాన్షియల్ క్యాపిటల్ గా నిలుస్తున్న శేరిలింగంపల్లి : ఎమ్మెల్యే గాంధీ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్ డివిజన్ గఫూర్ నగర్ లో 11 కోట్ల 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో, నూతనంగా చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) పనులకు శుక్రవారం తెలంగాణ పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఫైనాన్సియల్ క్యాపిటల్ గా నిలుస్తుందని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ వచ్చామని, భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి పథంలో తీసుకొని వెళతామని అన్నారు. నాటి బస్తీలు నేడు మౌలిక వసతులతో కూడిన కాలనీలుగా అభివృద్ధి చెందాయని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, మిగిలిపోయిన అభివృద్ధి పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, నాయకులు ఊట్ల కృష్ణ, మల్లెల శ్రావణ్ యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కుమ్మరి శ్రీనివాస్, మంగళరావు తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, బుడుగు తిరుపతి రెడ్డి, రజనీకాంత్, నరేష్ ముదిరాజ్, వినయ్, పిఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రీకాల్ ప్రకటించిన కియా..

# 1380 ఈవీ6 కార్లు వెనక్కి



ప్రముఖ వాహన తయారీ సంస్థ.. కియా మోటార్స్ తన 'ఈవీ6' కోసం స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది. 2022 మార్చి 3 నుంచి 2023 ఏప్రిల్ 14 మధ్య తయారైన మొత్తం 1,380 యూనిట్లలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఈ రీకాల్ ప్రకటించడం జరిగింది.కియా ఈవీ6 ఎలక్ట్రిక్ కార్లలో.. ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్ (ICCU)లో 12వీ బ్యాటరీ పనితీరును ప్రభావితం చేసే లోపం కారణంగా రీకాల్ పరకటించింది. ఈ సమస్య కారణంగా.. 2024లో కూడా కంపెనీ 1138 యూనిట్లకు రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోమారు రీకాల్ జారీచేసింది.ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్ (ICCU)లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ 12వీ బ్యాటరీ ఛార్జింగ్.. పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది కారులోని లైట్స్, వైపర్లు, మ్యూజిక్ సిస్టమ్ వంటి వాటికి శక్తిని ఇస్తుంది. కార్లలో ఈ లోపాన్ని కంపెనీ ఉచితంగానే పరిష్కరిస్తుంది. అయితే సంబంధిత వాహనాల యజమానులను నేరుగా సంప్రదించి వాటిని అప్‌డేట్ చేస్తామని కంపెనీ పేర్కొంది. ప్రభావిత వాహనాల కస్టమర్లు అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసుకోవడానికి.. సంబంధిత కియా డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు, లేదా ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయవచ్చు. కియా రీకాల్ గురించి రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ (MoRTH) కు కూడా సమాచారం అందించింది.



# నేడు బంగారం, వెండి ధరలు ఎంతంటే..

నేడు స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఇతర నగరాల్లో ప్రస్తుతం రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం. గతం కొంత కాలంగా క్రమేపీ పెరుగుతున్న బంగారం ధరలు నేడు కూడా స్వల్పంగా పెరిగాయి. నేడు (21-02-2025) ఉదయం 6.30కు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర నిన్నటి రేట్లతో పోలిస్తే రూ.10 మేర పెరిగి రూ.88,200కు చేరుకుంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.80,860 వద్ద తచ్చాడుతోంది.ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధరలు క్రమక్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారంవైపు మొగ్గు చూపడంతో ధరలకు రెక్కలొచ్చాయి. గతంలోలా భారీ స్థాయిలో మార్పులు లేకపోయినా క్రమంగా రేట్లు పెరుగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇక వెండి ధరలో మాత్రం నిన్నటితో పోలిస్తే తగ్గుదల కనిపించింది. నిన్న కేజీ వెండి ధర రూ.1,00,500 కాగా నేడు అది రూ.100 తగ్గి రూ. 1,00,500కు చేరుకుంది. గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న వెండి ధరలు నేడు స్వల్పంగా తగ్గడం గమనార్హం.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (22, 24 క్యారెట్లు) ఇవీచెన్నై: రూ.80710, రూ.88050ముంబై: రూ.80710, రూ.88050 ఢిల్లీ: రూ. 80860, రూ.88200కోల్‌కతా: రూ. 80710, రూ.88050హైదరాబాద్: రూ. 80710, రూ. 88050





# మెటాలో ఉద్యోగులకు ఊస్టింగులు..

# బాసులకు బోనస్‌లు.. ఏంటీ అన్యాయం?

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృ సంస్థ మెటా వివాదాస్పద నిర్ణయాన్ని ప్రకటించింది. తమ టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు వారి బేసిక్ పేలో 200 శాతం వరకు బోనస్‌లు ఇవ్వాలని నిర్ణయించింది. తక్కువ పనితీరు పేరుతో 5 శాతం మంది ఉద్యోగులను తొలగించిన వారం రోజుల్లోనే ఈ నిర్ణయం రావడంతో కంపెనీపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు బోనస్‌ల చెల్లింపు నిర్ణయాన్ని ఫిబ్రవరి 13న మెటా డైరెక్టర్ల బోర్డు కమిటీ ఆమోదించింది. పోటీ కంపెనీలలో ఇలాంటి పాత్రలతో పోలిస్తే తమ ఎగ్జిక్యూటివ్ పరిహారం 15 శాతం మేర తక్కువగా ఉందన్న కారణంతో మెటా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ బోనస్ ప్రకటన సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు వర్తించదని కంపెనీ ఫైలింగ్‌లో పేర్కొంది.అల్ప స్థాయి ఉద్యోగులను తొలగించి బాస్‌లకు బోనస్‌లు ప్రకటించడం తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. ఉద్యోగులను తొలగిస్తూనే ఎగ్జిక్యూటివ్‌లకు భారీగా బోనస్‌లను అందించడం అన్యాయమని విమర్శకులు వాదిస్తున్నారు. కంపెనీలోని ఆదాయ అసమానతల సమస్యలను ఇది ఎత్తి చూపుతుందని పేర్కొంటున్నారు.ఇది చదివారా? 'ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది'ఈ నిర్ణయాన్ని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ సమర్థించుకున్నారు. బోనస్‌లు అత్యుత్తమ ప్రతిభను నిలుపుకోవడానికి కంపెనీ నిరంతర వృద్ధి, విజయాన్ని నిర్ధారించడానికి అవసరమైన ప్రోత్సాహకం అని పేర్కొన్నారు. అయితే ఉద్యోగులు, కార్మిక హక్కుల వాదులు ఇటీవలి తొలగింపుల నేపథ్యంలో బోనస్‌లకు ఇదా సమయం అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఎగ్జిక్యూటివ్ బోనస్‌లను 200 శాతానికి పెంచాలనే నిర్ణయం మునుపటి 75 శాతం నుండి గణనీయమైన పెరుగుదల. పెరుగుతున్న పోటీ, ఆర్థిక సవాళ్ల మధ్య కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, లాభదాయకతను మెరుగుపరచడానికి ఈ చర్య విస్తృత వ్యూహంలో భాగమని కంపెనీ చెబుతోంది

# భారత్‌లో గూగుల్ రిటైల్ స్టోర్లు

### తొలిదశలో ఢిల్లీ, ముంబై, బెంగళూరులో ప్రారంభం?





**న్యూఢిల్లీ:** అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్ త్వరలో భారత్‌లో తన రిటైల్ విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఈ స్టోర్ల ద్వారా భారత వినియోగదారులకు అత్యాధునిక గాడ్జెట్లను ప్రత్యక్షంగా అందుబాటులోకి తీసుకురానుంది. తొలి దశలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. మొదటి స్టోర్ కనీసం 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసి, వచ్చే ఆరు నెలల్లో ప్రారంభించే అవకాశముంది.గూగుల్ రిటైల్ స్టోర్ల ద్వారా పిక్సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్‌బడ్స్ తో పాటు ఇతర టెక్నాలజీ ఉత్పత్తులను విక్రయించనుంది. అంతేకాక, వినియోగదారులకు డివైస్‌ల డెమో, టెక్నికల్ సపోర్ట్, ప్రీమియం కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించేలా ఈ స్టోర్లను అభివృద్ధి చేయనుంది.ప్రస్తుతం గూగుల్ అమెరికాలో మాత్రమే 5 రిటైల్ స్టోర్లను నిర్వహిస్తోంది. అయితే యూఎస్ తర్వాత గూగుల్ స్టోర్లను ప్రారంభించేందుకు భారత్‌ను ఎంపిక చేయడం గమనార్హం. గూగుల్‌కు భారత్ అతిపెద్ద, వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో ఒకటిగా ఉంది. కంపెనీ ఇప్పటికే దేశంలో సాంకేతిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం 1,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు ప్రకటించింది.గతంలో గూగుల్ భారత్‌లో తన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ల విక్రయాన్ని ప్రధానంగా ఆన్‌లైన్ వేదికల ద్వారా నిర్వహించింది. కానీ వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచే దిశగా ఇప్పుడు రిటైల్ విక్రయ కేంద్రాల స్థాపనపై దృష్టి సారిస్తోంది.ఇదిలా ఉండగా, గూగుల్ మాదిరిగానే యాపిల్ కూడా ఇటీవలే ఢిల్లీ, ముంబైలో తన స్టోర్లను ప్రారంభించింది. టెక్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రత్యక్షంగా వినియోగదారులకు అందించేందుకు రిటైల్ స్టోర్లను ప్రాధాన్యం ఇస్తుండటం గమనించదగ్గ పరిణామం.ఈ రిటైల్ స్టోర్ల ద్వారా భారత వినియోగదారులకు అధునాతన టెక్నాలజీ ఉత్పత్తులు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల గూగుల్ తన మార్కెట్ విస్తరణను మరింత పెంచుకోవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.


# నష్టాలతో ముగిసిన మార్కెట్లు.. టాప్ లూజర్స్ ఇవే..



దేశీయ బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలైన బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఈ వారం చివరి ట్రేడింగ్ సెషన్‌ను ప్రతికూలంగా ముగించాయి. 30-షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 424.90 పాయింట్లు లేదా 0.56 శాతం నష్టంతో 75,311.06 వద్ద స్థిరపడింది. ఈరోజు ఇండెక్స్ 75,748.72 నుండి 75,112.41 పరిధిలో ట్రేడైంది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 127.25 పాయింట్లు లేదా 0.51 శాతం తగ్గి 22,795.90 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 ఈరోజు గరిష్ట స్థాయి 22,921ను నమోదు చేయగా, కనిష్ట స్థాయి 22,720 గా ఉంది. నిఫ్టీ 50లోని 50 కాంపోనెంట్ స్టాక్‌లలో 35 నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా & మహీంద్రా, అదానీ పోర్ట్స్, బీపీసీఎల్, టాటా మోటార్స్, విప్రో షేర్లు 6.20 శాతం వరకు నష్టాలతో టాప్ లూజర్స్‌గా నిలిచాయి.శుక్రవారం నిఫ్టీ మిడ్‌క్యాప్100, నిఫ్టీ స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 1.32 శాతం, 0.70 శాతం నష్టాలతో స్థిరపడటంతో విస్తృత మార్కెట్లు కూడా బెంచ్‌మార్క్‌లను ప్రతిబింబించాయి. నిఫ్టీ మెటల్ తప్ప మిగతా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఆటో అత్యధికంగా నష్టపోయింది. ఇది 2.58 శాతం తగ్గింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్, రియాల్టీ, ఫార్మా, ఓఎంసీ సూచీలు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా నష్టంతో స్థిరపడ్డాయి



# ఐకాన్ స్టార్.. మరో రికార్డ్




ఈ-కబురు, హైదరాబాద్: పుష్ప సినిమాతో తెలుగు సినిమాకు వినూత్న గుర్తింపును తేవటమే గాక ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును పొందిన బన్నీ.. ఇప్పుడు మరో ఘనతను తన సొంతం చేసుకున్నారు. పముఖ సినిమా మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'పేరుతో భారత్‌లోనూ రంగంలోకి దిగింది. కాగా, ఈ మ్యాగజైన్ తొలి సంచిక అల్లు అర్జున్ కవర్ ఫొటోతో రానుంది. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటో షూట్‌ను నిర్వహించారు. ఆ బీటీఎస్ ప్రోమో వీడియోను మ్యాగజైన్ టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.'సినిమాకు హద్దులు లేవని నిరూపించిన స్టార్.. అల్లు అర్జున్: ది రూల్'అనే పేరుతో బన్నీ కవర్ స్టోరీ రానుంది. 'జీవితంలో ఎంత గొప్ప విజయం సాధించినా వినయంగా ఉండాలి. 100 శాతం నేను సామాన్యుడిగానే బతకడానికి ప్రయత్నిస్తా'అని ఆ ఇంటర్వ్యూలో చెప్పిన వైనం బన్నీ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది.

# ఆందోళన వద్దు.. అమ్మ బాగుంది



ఈ-కబురు, హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అస్వస్థతకు గురైయినట్లు శుక్రవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని చిరంజీవి టీమ్ వెల్లడించింది. శుక్రవారం తెల్లవారుజామున అంజనా దేవి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు, వైద్యులు ఆమెకు ప్రస్తుత చికిత్స అందిస్తున్నట్లుగా వచ్చిన వార్తలతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిరంజీవి అభిమానులు ఆందోళనకు గురయ్యారు. దీంతో రంగంలోకి దిగిన చిరంజీవి టీమ్ దీనిపై క్లారిటీ ఇచ్చింది. గతవారం రెగ్యులర్ చెకప్‌లో భాగంగా ఆస్పత్రికి తీసుకెళ్లామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని, అభిమానులెవరూ ఈ వార్తలను పట్టించుకోవాల్సిన పనిలేదని వారు తెలిపారు.

# ప్లీజ్.. అలా చేయొద్దు

ఈ-కబురు, హైదరాబాద్: లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో వరుస హిట్లు తన ఖాతాలో వేసుకున్న నటి.. మీనాక్షి చౌదరి. తన అందం, అభినయంతో వరుసగా అవకాశాలు దక్కించుకుంటున్న ఈ నటి కొత్తగా సినిమాల్లోకి వచ్చే అమ్మాయిలకు ఎదురయ్యే సమస్యల గురించి తాజాగా, ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. గతంలో పోల్చితే ఇప్పుడు సినిమా రంగంలోకి వచ్చే హీరోయిన్లకు సానుకూల వాతావరణం ఉందని, అయితే, ఎలాగైనా ఆఫర్‌ను దక్కించుకోవాలనే తొందరలో అమ్మాయిలు తమ వ్యక్తిత్వాన్ని వదులుకోవాల్సిన పని లేదంటూ సలహా ఇచ్చింది. 'మీరు ఎలా ఉన్నారో అలాగే ఉంటూనే అవకాశాల కోసం ప్రయత్నించండి. అప్పుడే మీరు సినీరంగంలో ఎక్కువ కాలం మనగలుగుతారు'అని చెప్పుకొచ్చింది.

## మిమ్మల్ని నిరాశపరిచా..

# సారీ



ఈ-కబురు, హైదరాబాద్: యువ నటుడు విశ్వక్ సేన్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపాడు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశాడు. ఇటీవల విశ్వక్ ప్రధాన పాత్రలో నటించిన లైలా చిత్రం.. విడుదలకు ముందే వివాదంలో చిక్కుకోవడం, ఈ సినిమా కంటెంట్ అంతగా అభిమానులను ఆకట్టుకోలేకపోవటంపై విశ్వక్ విచారం వ్యక్తంచేశాడు. ఇకపై మంచి సినిమాలే చేస్తానని తెలిపాడు.తనను నమ్మి ప్రోత్సహిస్తున్న అభిమానులకు తన సినిమా నచ్చకపోతే చెప్పే హక్కు ఉందని, దానిని తాను గౌరవిస్తానని మరో మంచి ప్రయత్నంతో తిరిగి వస్తానని ఆ ట్వీట్‌లో చెప్పుకొచ్చారు.

## షాకిచ్చే పోజులిస్తున్న షాలిని



ఈ-కబురు, హైదరాబాద్: విజయ్ దేవరకొండ నటించిన అర్జున్ రెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన షాలిని పాండే.. తొలి చిత్రంతోనే యూత్ మనసును కొల్లగొట్టింది. ఇటీవలే బాలీవుడ్ చిత్రం.. 'మహరాజ్'లో మెరిసిన ఈ అందాలభామ ఇప్పుడు చేతిలో పెద్దగా సినిమాలు లేకపోవటంతో గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి సుమారు 2 మిలియన్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. కాగా, తాజాగా, పింక్ వన్ పీస్ డ్రెస్‌లో తాను దిగిన ఫోటోలను అభిమానుల కోసం సోషల్ మీడియాలో పంచుకుంది. అవి చూసిన ఫ్యాన్స్ ఆమె అందాన్ని వేయినోళ్ల పొగుడుతున్నారు.




## అకాల మృత్యువు పాలైన యష్టికా

న్యూఢిల్లీ: ఎంతో భవిష్యత్ ఉన్న ఓ యువ మహిళా వెయిట్ లిఫ్టర్ అకాల మృత్యువు పాలైన హృదయవిదారకమైన  ఘటన రాజస్థాన్‌లో జరిగింది. బికనీర్‌కు చెందిన యష్టికా ఆచార్య అనే 17 ఏళ్ల యువతి వెయిట్ లిఫ్టింగ్ మీద అభిరుచితో దానినే కెరీర్‌గా ఎంచుకుంది. అంతేకాదు.. జూనియర్ నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటి, వచ్చే ఒలింపిక్స్ క్రీడలకు రెడీ అవుతోంది. ఆమె ప్రతిభను చూసిన క్రీడా నిపుణులు ఆమెకు గొప్ప భవిష్యత్ ఉందని ప్రోత్సహిస్తూ వచ్చారు. కానీ,  బుధవారం 270 కిలోల బరువు వెయిట్ లిఫ్టింగ్ సాధన చేసే క్రమంలో.. ట్రైనర్ నిర్లక్ష్యంతో స్క్వాట్ రాడ్ జారి ఆమె మెడపై పడటంతో మెడలు విరిగి ప్రాణాలను కోల్పోయింది. ఈ సమయంలో ఆమె వెనకాలే ట్రైనర్, పక్కనే ఇతర లిఫ్టర్లు ఉన్నా కూడా ఏం చేయలేకపోయారు.

## దూకుడు పెంచండి..



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఫిబ్రవరి 23న పాకిస్థాన్, భారత్‌ల మధ్య పోరు జరగనున్న వేళ.. పాక్ లెజెండ్ షోయబ్ అక్తర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా మీద పాకిస్థాన్ జట్టు నెగ్గాలంటే దూకుడు ఒక్కటే మార్గమని సూచించాడు. పాక్ టీమ్‌లో పెద్దగా ఇంపాక్ట్ ప్లేయర్లు లేరని.. స్ట్రైక్ రేట్ కూడా స్లోగా ఉందని, కనుక బలమైన టీమిండియాకు చెక్ పెట్టాలంటే.. యాగ్రెసివ్‌గా ఆడాలని అక్తర్ వివరించాడు. న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్‌లో ఓడిన నేపథ్యంలో భారత్ మీద చావో రేవో అన్నట్లుగా పోరాడితేనే.. పాక్ జట్టు సెమీస్‌కు వెళ్లగలదనే వాస్తవాన్ని ప్రతి పాక్ ప్లేయర్ గుర్తుంచుకోవాలని హెచ్చరించాడు.



## రంజీ ట్రోఫీ ఫైనల్‌లో కేరళ టీమ్

న్యూఢిల్లీ: కేరళ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్ కు చేరుకుని చరిత్ర సృష్టించింది. 74 ఏళ్ల చరిత్రలో కేరళ రంజీ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇదే తొలి సారి. ఈ మ్యాచ్ లో కేరళ కేవలం రెండు పరుగుల ఆధిక్యంతో గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లింది. సెమీ ఫైనల్ లో కేరళ మొదటి ఇన్నింగ్స్ ఆధారంగా రెండు పరుగుల ఆధిక్యాన్ని సాధించి.. 74 ఏళ్లలో మొదటిసారి ఫైనల్ కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్ లో కేరళ జమ్మూ కశ్మీర్ ను కేవలం ఒక పరుగు తేడాతో ఓడించింది. సెమీఫైనల్ లో మొదట బ్యాటింగ్ చేసిన కేరళ 457 పరుగులు చేయగా.. అనంతరం గుజరాత్ జట్టు 455 పరుగులకు ఆలౌట్ అయింది. రంజీ రూల్స్ ప్రకారం.. కేరళ సెమీస్ లో విజేత గా నిలిచి ఫైనల్ కు చేరుకుంది.

## టీమిండియా పగ్గాలు.. అతడికే




న్యూఢిల్లీ: ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్ శర్మ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంటాడని, కొత్త కెప్టెన్ కోసం బీసీసీఐ ఇప్పటికే అన్వేషణ మొదలు పెట్టిందనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గతంతో శుభమన్ గిల్, జస్ పీత్ బుమ్రాలకు కెప్టెన్‌గా అవకాశం లభించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతున్న వేళ.. దీనిపై తాజాగా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. తన ఆలోచన ప్రకారం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కలిసి ఆడే చివరి టోర్నమెంట్ ఇదే కావచ్చని చెప్పుకొచ్చాడు. ఈ టోర్నీలో కోహ్లీ కొత్త రికార్డులు సృష్టిస్తాడని భావిస్తున్నట్లు తెలిపాడు.. ఇక.. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టు కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్ ఎంపికయ్యే అవకాశం ఉందని ఊతప్ప వ్యాఖ్యానించాడు.

## పంకజ్ ప్రపంచ రికార్డ్




న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో తనకు తిరుగులేదని భారత ఏస్ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీ(39) మరోసారి నిరూపించుకున్నాడు. తాజాగా ముగిసిన ఆసియా స్నూకర్ చాంపియన్షిప్ లో అతను విజేతగా నిలిచాడు. ఫైనల్లో పంకజ్ 4–1 ఫ్రేమ్‌ల తేడాతో ఇరాన్‌కు చెందిన మాజీ ఆసియా, ప్రపంచ స్నూకర్ చాంపియన్ అమిర్ సర్ఖోష్‌పై విజయం సాధించాడు. పంకజ్‌కు ఇది 14వ ఆసియా టైటిల్ కావడం విశేషం. 'చాలా టఫ్ ఫైట్ ఉన్నప్పటికీ బంగారు పతకం పొందటం చాలా సంతోషంగా ఉంది. ఇదే నిలకడైన ప్రదర్శనతో భారత్ గర్వించే విజయాలు మరెన్నో సాధించాలని ఆశిస్తున్నాను'అని పంకజ్ చెప్పుకొచ్చారు. తాజా ఆసియా టైటిల్‌తో ఓ క్యాలెండర్ ఇయర్‌లో జాతీయ, ఆసియా, ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లు గెలిచిన ఆటగాడిగా పంకజ్ నిలిచారు.